'వీధి వ్యాపారులు రోడ్డుపాలు'

సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : వీధి వ్యాపారుల విషయంలో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుండా తొలగింపు పనులు చేపట్టడంపై సీపీఎం నగర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు. కొన్ని వారాలుగా మున్సిపల్, ట్రాఫిక్ పోలీసులు వీధి వ్యాపారులను అడ్డగోలుగా తొలగిస్తున్నారని, కనీస సమాచారం, వ్యవధి ఇవ్వకుండా రోడ్డుపాలు చేయడాన్ని తప్పుబట్టారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి 'ఆపరేషన్ రోప్' పేరుతో నగర పోలీసు యంత్రాంగం వీధి వ్యాపారులను తొలగించే ప్రక్రియ చేపట్టిందని, హాకర్స్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయడం గానీ, ప్రజాప్రతినిధులతో చర్చించడం కానీ చేయకుండా ఏకపక్షంగా ఈ చర్యలు చేపట్టడం ఎంత వరకు సమంజసమని వెంకటేశ్ ప్రశ్నించారు. వీధి వ్యాపారుల సమస్యలు, తొలగింపులపై చర్చించాలని తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ మేయర్‌కు సీపీఎం విజ్ఞప్తి చేసింది.

ఉచితంగా బీఎస్సీ పారామెడికల్ అడ్మిషన్లు

బేగంపేట్ జనవరి 24: కిమ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కిమ్స్ బీఎస్సీ, పారామెడికల్ కళాశాలలో పేద విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ సీహెచ్ నాగేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, రీనల్ డయాలసిస్ టెక్నాలజీ ఆప్తోమెట్రీ టెక్నాలజీ, క్రిటికల్ కేర్ టెక్నాలజీ, మెడికల్ రికార్డ్స్ టెక్నాలజీ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 27వ తేదీలోగా బీఎస్సీ పారామెడికల్ కాలేజ్ నాలుగో అంతస్తు ప్యారడైజ్ తేజ్ బ్లాక్ పాత సన్‌షైన్ ఆసుపత్రి సికింద్రాబాద్‌లో సంప్రదించాలని కోరారు. వివరాలకు 70935 89568, 82472 55859 నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

ఆశల ఆందోళన

ఆశవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో(సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో టెలిఫోన్ భవన్ నుంచి పాదయాత్రగా బయలుదేరి లక్డీకాపూల్‌లోని కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్‌లను నెరవేర్చాలని యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

సందడిగా పశుసంక్రాంతి

పశుసంక్రాంతి మార్కెట్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గేదెలు

మణికొండ,జనవరి 24: జాతీయస్థాయి పశువుల జాతర 'పశు సంక్రాంతిని' రంగారెడ్డి జిల్లా పరిధిలోని నార్సింగిలో శుక్రవారం నిర్వహించారు. దేశ నలుమూలల నుంచి పాడి, పశు వ్యాపారులు పెద్ద ఎత్తున తరలివచ్చి పశువులను కొనుగోలు చేశారు. నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పశు సంక్రాంతిలో శుక్రవారం ఒక్కరోజే సుమారు రూ.4 కోట్లకు పైగా వ్యాపార లావాదేవీలు జరిగినట్లు అధికారులు తెలిపారు. ముర్రా,దులియా జాతికి చెందిన గేదెలను పాల వ్యాపారులు పోటీ పడి కొనుగోలు చేశారు. ఆవులలో దేశీ ఆవులు, పుంగనూరు జాతికి చెందిన ఆవులు అధికంగా విక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. షాబాద్ మండలానికి చెందిన పాలవ్యాపారి సాయికృష్ణారెడ్డి దులియా జాతికిచెందిన రెండు గేదెలను రూ. 4లక్షల 10వేలకు కొనుగోలు చేశారు. రెండురోజులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణుకుమార్‌గౌడ్ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. టీపీసీసీ స్పోక్స్ పర్సన్ ముంగి జైపాల్‌రెడ్డి, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్,నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశ్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుకుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ దశరథ్ యాదవ్ తదితరులు మార్కెట్ కమిటీని సందర్శించారు.

26న 'రన్‌ఫర్ యూనిటీ'

హైదరాబాద్, ఆట ప్రతినిధి: 76వ రిపబ్లిక్ డే సందర్భంగా ఈనెల 26న ఏఎస్‌బీఎల్ స్ప్రింగ్స్ రెసిడెన్షియల్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమంలో భాగంగా పోచారంలో ఈ మారాథాన్‌లో 5కే, 10కే ఈవెంట్లు నిర్వహించనున్నారు. ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యమిస్తూ కమ్యూనిటీలోని అన్ని కుటుంబాలను ఒకచోట చేర్చడంతో పాటు గణతంత్ర దినోత్సవం రోజు రాజ్యాంగ విలువలను పెంపొందించేందుకు ఈ మారథాన్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం ఫిట్‌నెస్ వరకే పరిమితం గాకుండా ఇరుగు పొరుగు మధ్య మెరుగైన సంబంధాల పునరుద్ధరణ కోసం జరిగే ఈ మారథాన్‌లో విజేతలకు ఆసక్తికరమైన బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

'వద్దిరాజు'కు జన్మదిన శుభాకాంక్షలు

తన జన్మదినం సందర్భంగా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్.. వద్దిరాజుకు శుభాకాంక్షలు తెలిపారు

ఎలివేటెడ్ కారిడార్‌ను 100 ఫీట్లకు తగ్గించాలి

ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతున్న బాధితులు

బొల్లారం, జనవరి 24: జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు నిర్మించతలపెట్టిన ఎలివేటేడ్ కారిడార్‌ను 100 ఫీట్లకు తగ్గించాలని ఆస్తుల యజమానుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చైర్మన్ సతీశ్ కోరారు. రాజీవ్ రహదారి రోడ్డులో ఎలివేటెడ్ కారిడార్‌ను 200 ఫీట్లకు విస్తరించి నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. శుక్రవారం తిరుమలగిరి టీచర్స్ కాలనీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి గ్రామసభ నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ అపర్ణ, తిరుమలగిరి తహసీల్దార్ అశోక్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీశ్ కమిటీ సభ్యులతో కలిసి రోడ్డు వెడల్పు విస్తీర్ణాన్ని తగ్గించాలని వినతి పత్రం అందజేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఉప్పల్ రోడ్డు విస్తరణలో భాగంగా ప్రజల కోరిక మేరకు 150 ఫీట్లు తగ్గించి నష్టపోయిన బాధితులకు ఉప్పల్ భగాయత్‌లో ఖరీదైన భూములను ప్రభుత్వం ఇచ్చిందని గుర్తు చేశారు. 200 ఫీట్ల వరకు నిర్మాణం చేపడితే వేలాది కుటుంబాలు వ్యాపారాలు, గృహ,ఆస్తులను కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి నెలకొందని తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ అపర్ణ మాట్లాడుతూ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భూములు కోల్పోయే బాధితులకు ప్రభుత్వంతో మాట్లాడి సరైన న్యాయం జరిగిలే చూస్తామని హామీ ఇచ్చారు. అమర్‌నాథ్,సుబ్బారావు,వెంకన్న, శ్రీనివాస్,రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

సిటీబ్యూరో, జనవరి 24(నమస్తే తెలంగాణ): తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం యూనియన్ డైరీని హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి వెంకట్ డీఎంహెచ్ఓ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రాజశేఖర్, అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి, ఖైరతాబాద్ డీఎంహెచ్ఓ తుకారంబట్, హైదరాబాద్ జిల్లా ప్రెసిడెంట్ పద్మశ్రీ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, జిల్లా సెక్రటరీ నరేశ్, వైస్ ప్రెసిడెంట్ శివకుమార్, అనిత, సబిత తదితరులు పాల్గొన్నారు.

టీ హబ్ గ్లోబల్ బ్రాండ్‌గా మారింది

జూబ్లీహిల్స్‌లోని టర్కీ కాన్సులేట్ కార్యాలయంలో ఐటీఎఫ్ఏను ప్రారంభిస్తున్న టర్కీ కాన్సులేట్ జనరల్ ఒర్హాన్ యాల్మన్ ఒకాన్

బంజారాహిల్స్,జనవరి 24: హైదరాబాద్‌లోని 'టీ హబ్' సాధిస్తున్న విజయాలతో గ్లోబల్ బ్రాండ్‌గా మారిందని, భారత్, టర్కీ దేశాల మధ్యన వ్యాపార సంబంధాలు పెంచడంలో మరింత దోహదపడుతుందని భారత్‌లో టర్కీ కాన్సులేట్ జనరల్ ఒర్హాన్ యాల్మన్ ఒకాన్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని టర్కీ కాన్సులేట్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 'ఇండో-టర్కీ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్' (ఐటీఎఫ్ఏ)ను ఒర్హాన్ యాల్మన్ ఒకాన్ ప్రారంభించారు. వాణిజ్య సంబంధాల్లో పరస్పరం సహకరించుకునేందుకు టీ హబ్‌తో ఐటీఎఫ్ఏ అవగాహన ఒప్పందంపై టర్కీ కాన్సులేట్ జనరల్ సమక్షంలో ఐటీఎఫ్ఏ అధ్యక్షుడు ఫయాజ్‌ఖాన్, టీ హబ్ సీఈవో సుజితా జాగిర్దార్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఒర్హాన్ యాల్మన్ ఒకాన్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరం ఎంతో వైవిధ్యభరితమైనదని, ఆర్థికంగా అద్భుతమైన పురోగతి సాధించేందుకు అనువైన నగరమన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

- రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం కేటాయించాలి
- సేవ్ ఎడ్యుకేషన్ ప్రతినిధి ప్రొఫెసర్ హరగోపాల్

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ఖైరతాబాద్, జనవరి 24 : రాష్ట్రంలో విద్యారంగాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని సేవ్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధి ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శించారు. సేవ్ ఎడ్యుకేషన్, సోషల్ డెమోక్రటిక్ ఫోరం, ఎంవీ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఎంవీ ఫౌండేషన్ చీఫ్ కోఆర్డినేటర్ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో భూస్వామ్య రాజకీయం కొనసాగుతుందని, ప్రజలు చైతన్యవంతులైతే తమకు ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో విద్యకు ప్రాధాన్యతనివ్వడం లేదని ఎద్దేవా చేశారు. విద్యారంగంలో రాజకీయరంగు పులుముకుందని, ఓ మాఫియాలా మారిపోయిందన్నారు. విద్యారంగానికి ఖర్చులా కాకుండా ఓ పెట్టుబడిలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. విద్యకు తగిన బడ్జెట్‌ను కేటాయిస్తే విద్యాభివృద్ధి జరిగి రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరవాలని, కనీసం రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం కేటాయించాలన్నారు. సోషల్ డెమొక్రటిక్ ఫోరం అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశంలోనే విద్యారంగంలో అత్యంత వెనుకబడిన రాష్ట్రంగా తెలంగాణ మిగిలిపోయిందన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో అంతకన్నా అధ్వానంగా ఉందన్నారు. ఏపీ, కర్నాటక రాష్ట్రాల్లో 13, తమిళనాడులో 14, కేరళలో 15 శాతం, బీహార్ రాష్ట్రంలో 18, , రాజస్థాన్‌లో 20 శాతం కేటాయిస్తున్నారని, కానీ తెలంగాణకు వచ్చే సరికి కేవలం 7.6 శాతం మాత్రమే బడ్జెట్ కేటాయిస్తున్నారన్నారు. విద్యకు అధిక బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ నర్సింహా రెడ్డి, ప్రొఫెసర్ చక్రధర్, ప్రొఫెసర్ రమా మేల్కోటే, ప్రొఫెసర్ పద్మజా షా, ప్రొఫెసర్ మురళీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటెక్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : ఇండియన్ మిషైన్ టూల్ మ్యానుఫ్యాక్చర్స్ అసోసియేషన్ (ఐఎంటీఎంఏ) ఆధ్వర్యంలో బెంగళూరులోని బీఐఈసీలో ఇంటెక్స్(ఐఎటీఈఎక్స్) ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. ఇండియన్ అండ్ గ్లోబల్ మిషన్ టూల్స్ ఇండస్ట్రీలో ట్రెండ్స్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ తదితర అంశాలపై తెలుసుకునే అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కర్నాటక రాష్ట్ర పరిశ్రమలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ మంత్రి ఎం.బి. పాటిల్ తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.

పెంపుడు జంతువుల దత్తత

31న హైటెక్స్‌లో కిడ్స్ బిజినెస్ ఫెయిర్, పెటెక్స్ ఎక్స్‌పో

మాదాపూర్, జనవరి 24: దేశంలో పెంపుడు జంతువుల దత్తత అంతకంతకు పెరుగుతుందని గ్రోవెల్ ఫీడ్స్ హెడ్ రామకృష్ణ అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు కొనసాగనున్న కిడ్స్ బిజినెస్ కార్నివాల్, పెటెక్స్ ఎక్స్‌పోను నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం హైటెక్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో హైటెక్స్ బిజినెస్ హెడ్ టీజీ శ్రీకాంత్‌తో పాటు నిర్వాహకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులను పెంచుకోవడం వల్ల కలిగే మేలు ఏమిటంటే అది పిల్లలకు బాధ్యతను నేర్పే అవకాశాన్ని ఇస్తుందన్నారు. దేశంలో పెంపుడు జంతువుల దత్తత నానాటికి పెరుగుతుందన్నారు.గుర్రపు స్వారీ అనేది బలమని, సమతుల్యత, సమన్వయాన్ని పెంపొందించడానికి ఒక అసాధారణమైన మార్గమని చెప్పారు. ఇందులోని ఎగ్జిబిటర్లు టర్కీ, చెక్ రిపబ్లిక్, జపాన్, సింగపూర్, జర్మనీ వంటి వివిధ దేశాల ప్రేమికులు, ఔత్సాహికులను ఒకచోట చేర్చుతుందన్నారు. ఇందులో 70 కి పైగా అలంకారమైన చేపలు, గుర్రాలు, పక్షులు, అంతర్జాతీయ పిల్లుల చాంపియన్ షిప్, కుక్కల ఫ్యాషన్ షో, కే 9 స్కూల్ ద్వారా కుక్కల యొక్క చురుకుదనం, విధేయత ప్రదర్శనలు, స్కూపీ స్క్రబ్ ద్వారా కుక్కల కోసం ఉచిత బేసిక్ గ్రూమింగ్ వంటి జంతువులను ప్రదర్శించనున్నారు. క్యాట్ చాంపియన్ షిప్‌ను ఇండియన్ క్యాట్ క్లబ్ నిర్వహిస్తుందన్నారు. ఇందులో 200 ప్లస్ రకాల పిల్లులు ఉంటాయన్నారు. కొన్ని అరుదైన జాతులలో మైనేకూన్‌తో పాటు జుట్టు పిల్లి, భారతదేశంలో పెరుగుతున్న జాతి పిల్లులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

నగరంలోని చెంగిచెర్లతో పాటు పలు చోట్ల శుక్రవారం ఉదయం దట్టంగా పొగ మంచు కమ్మేసింది. పొగ మంచు కురుస్తుండటంతో వాహనదారులు ఒకరికొకరు కనిపించని పరిస్థితి ఉత్పన్నమైంది. వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లారు. దీంతో ఉదయాన్నే మార్నింగ్ వాక్‌కు, ఉద్యోగాలకు వెళ్లే వారు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు ఇబ్బంది పడ్డారు.

గణతంత్ర దినోత్సవానికి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో వివిధ పోలీస్ దళాలు, ఎన్‌సీసీ విద్యార్థులు, గురుకుల విద్యార్థులతో కలిసి శుక్రవారం పరేడ్ రిహార్సల్స్ నిర్వహించారు. పోలీస్ బ్యాండ్ గుర్రాల కవాతు ఆకట్టుకుంది.